కాంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ జాహెదా బేగం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 12: ఈ నెల 14 నుంచి 20 వరకు నగరంలోని ఎంఎల్‌ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి ఉస్మానియా యూనివర్సిటీ కాంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ జాహెదా బేగం ఎంపికయ్యారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగంలో ఆమె ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా సైతం బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే శిబిరానికి ఓయూ నుంచి హాజరవుతున్న ఆరుగురు విద్యార్థులకు ఆమె నాయకత్వం వహించనున్నారు. తన ప్రతిభను గుర్తించి ఎంపిక చేసినందుకు ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, ఓయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సవీన్ సౌడకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మందుల కుల సంఘం అధ్యక్షుడిగా కార్తీక్‌కుమార్

చిక్కడపల్లి, జనవరి 12: తెలంగాణ రాష్ట్ర మందుల కుల సంఘ యువజన విభాగం అధ్యక్షుడిగా ఒంటెద్దు కార్తీక్‌కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం సందరయ్య విజ్ఞాన కేంద్రంలో మందుల కుల సంఘం యువ సమ్మేళనం నిర్వహించారు.

కారుణ్య నియామకాలకు బోర్డు ఆమోదం

- అక్రమ నిర్మాణాలకు జరిమానాలు
- వాడివేడిగా సాగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశం
- తొలిసారి బోర్డు సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే లాస్యనందిత

బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న బ్రిగేడియర్ అధికారి సోమశంకర్. చిత్రంలో ఎమ్మెల్యే లాస్యనందిత, బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్

కంటోన్మెంట్, జనవరి 12: ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నిమామకాలు చేపట్టేందుకు ఎట్టకేలకు కంటోన్మెంట్ బోర్డు ఆమోదం తెలిపింది. మొత్తం 120 మంది దరఖాస్తులకు గానూ తొలుత 27 మందికి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు మార్గం సుగుమమైంది. శుక్రవారం బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, ఎమ్మెల్యే లాస్యనందిత, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, జాయింట్ సీఈఓ ఆకాశ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

తొలుత కంటోన్మెంట్‌కు రక్షణ మంత్రిత్వ శాఖ అవార్డు రావడంపై అధ్యక్షుడు బోర్డు అధికారులు, స్థానిక ప్రజలకు అభినందనలు తెలిపారు. కంటోన్మెంట్ బోర్‌వెల్స్‌కు మీటర్లు పెట్టాలన్న ప్రతిపాదనకు రామకృష్ణ అభ్యంతరం తెలిపారు.

ఉద్యోగుల ఇంటి స్థలాలపై దుమారం..

హస్మత్ పేటలోని 28 ఎకరాల ట్రెన్సింగ్ గ్రౌండ్ స్థలాన్ని కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగులకు కేటాయించాలని సీఈఓ మధుకర్ నాయక్ ప్రతిపాదించగా, నామినేటెడ్ బోర్డు సభ్యుడు వ్యతిరేకించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో.. బోర్డు ఉద్యోగులు కూడా ఓ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం స్థలాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల మహేందర్ బోర్డు సమావేశం అనంతరం రామకృష్ణతో వాగ్వాదానికి దిగారు.

అక్రమ నిర్మాణాల నోటీసులపై..

అక్రమ నిర్మాణాలకు జారీ చేసే(248/320) నోటీసులపై సమావేశం వాడివేడిగా చర్చ జరిగింది. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని 248 నోటీసు జారీ చేసినా..నిర్మాణదారులు స్పందించని యెడల నెల రోజుల గడువు తర్వాత 320 నోటీసు జారీ చేసేందుకు బోర్డులో ప్రతిపాదన రాగా, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అడ్డుకున్నారు. 320 నోటీసు బోర్డు ఆమోదం లేకుండా ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణదారుల నుంచి ట్యాక్స్‌లు వసూలు చేయడంతోపాటు జరిమానాలు విధించాలని సీఈఓ ప్రతిపాదించగా, రామకృష్ణ వ్యతిరేకించారు. దీంతో ఆ అంశాన్ని పెండింగ్‌లో ఉంచారు.

ఉద్యోగులకు పదోన్నతులు..

కంటోన్మెంట్ బోర్డులో కీలక విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు అధికారులు మూడు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో మరో ముగ్గురు అధికారులకు పదోన్నతులు ఇవ్వడానికి బోర్డు ఆమోదం తెలిపింది. సమావేశంలో శానిటేషన్, నీటి విభాగం సూపరింటెండెంట్‌లు ఎం. దేవేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పాటిగడ్డలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలి

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, జనవరి 12 : బేగంపేట్ పాటిగడ్డలో రూ. 6 కోట్ల వ్యయంతో జి+2లో నిర్మితమవుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు తుది దశకు చేరుకున్నాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మిగిలిన పనులను కూడా పూర్తి చేసి వారం రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. శుక్రవారం బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, వివిధ శాఖల అధికారులతో కలిసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. లిఫ్ట్ ఏర్పాటుతో పాటు డ్రైనేజీ పనులు మిగిలిపోయాయని కార్పొరేటర్ మహేశ్వరి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లను పేదలకు నామమాత్రపు ఫీజుకే అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వడ్డెర బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణాలు, దేవిడిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు, బేగంపేట్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని ఖబరస్థాన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కార్యక్రమంలో జలమండలి డీజీఎం శశాంక్, జీహెచ్ఎంసీ డీఈ సంతోష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ తిరుమలేశ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్ నాయి, శేఖర్, ఆరిఫ్, అఖిల్, మొయిన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మెహిదీపట్నం జనవరి 12: కార్పొరేన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో నిర్మిస్తున్న బాక్స్‌టైప్ డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. రూ. 65 లక్షల నిధులతో ఎస్ఎఫ్‌సీ కాలనీ నుంచి హకీంపేట్ వరకు నిర్మిస్తున్న బాక్స్‌టైప్ డ్రైన్‌తో ముంపు సమస్యలు తప్పుతాయని ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ పేర్కొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి : కలెక్టర్

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జనవరి 12 నమస్తే తెలంగాణ/బొల్లారం : జీవితంలో ఏ వృత్తిని ఎంపిక చేసుకున్నా దానిని నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'కాల్ టు ది నేషన్' అనే పేరుతో విద్యార్థులకు స్లోగన్ పోటీలు నిర్వహించారు. 'యంగ్ అచీవర్స్' పేరుతో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజ జీవితంలో వైఫల్యం చెందినప్పుడు, కుంగిపోయినప్పుడు స్వామి వివేకానంద బోధనలు ఆచరించి నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల13, 14 తేదీల్లో రాష్ట్రపతి నిలయంలో రంగోళి పేరుతో ముగ్గులు, వంటలు, సంప్రదాయ దుస్తుల పోటీలు, వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ఎయిర్‌ఫోర్స్ గ్రూపు కెప్టెన్ కే ధర్మారావు, రామకృష్ణ మఠం నుంచి బాలాజీ సుకుమార్, వివిధ పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

- విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ లేడీస్ హాస్టల్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెస్‌లను పరిశీలించి, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతలో రాజీపడకూడదని అధికారులను ఆదేశించారు.

భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్ కే.హేమలత, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు.

– బన్సీలాల్‌పేట, జనవరి 12

పద్మారావునగర్‌లోని యూరోకిడ్స్ స్కూల్‌లో సంక్రాంతి సందర్భంగా ముగ్గులు , డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏస్తర్ విద్యావతి, కరస్పాండెంట్ థామస్ ఉదయ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

– బన్సీలాల్‌పేట, జనవరి 12

కైట్, స్వీట్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో శనివారం నుంచి జరుగనున్న కైట్, స్వీట్ ఫెస్టివల్ కోసం గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు.

జేబీఎస్ చౌరస్తాలో పీజేఆర్ జయంతి సందర్భంగా మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ

పేదల నాయకుడు పీజేఆర్

మారేడ్‌పల్లి, జనవరి 12: మాజీ సీఎల్పీ నేత, మాజీ మంత్రి పి. జనార్దన్‌రెడ్డి జయంతిని శుక్రవారం జేబీఎస్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీజేఆర్ విగ్రహానికి మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ..పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నందికంటి రవి, నాగేశ్, ముప్పిడి గోపాల్, శ్యామ్‌సన్‌రాజు, అమరేందర్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించిన రోజును పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీలో శుక్రవారం ఆయన విగ్రహానికి వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సోషియాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ మంగు, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ సయీదా అజీమున్నీసా, విద్యార్థి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

– ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 12

- ముగ్గుల పోటీలు

అమీర్‌పేట్‌లోని గురుగోబిందిసింగ్ స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు డివిజన్ నలుమూలల నుంచి మహిళలు వచ్చి రంగురంగుల ముగ్గులు వేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలకు సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ మహిళా నేతలతో కలిసి బహుమతులు అందజేశారు.

– అమీర్‌పేట్, జనవరి 12

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

మారేడ్‌పల్లి, జనవరి 12: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ అవుషాపూర్ ప్రాంతానికి చెందిన షేక్‌ఫిర్‌పాషా(71) కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదు. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య మృతుడు షేక్‌ఫిర్ పాషా పట్టాలు దాటుతుండగా వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన రేకులు

అమీర్‌పేట్, జనవరి 12: అమీర్‌పేట్ సత్యం థియేటర్ చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవంతి శ్లాబు రేకులు కూలి పక్కింట్లో పడ్డాయి. 6వ అంతస్తులో జరుగుతున్న శ్లాబు నిర్మాణాలకు సంబంధించి పనులు జరుగుతుండగానే రేకులు కూలి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఉదయం 7 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి భవన యజమాని శ్రీధర్‌రెడ్డిపై స్థానికులు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

చైనా మాంజా విక్రయం యువకుడిపై కేసు

కాచిగూడ,జనవరి 12: నిషేధిత చైనా మాంజాను అమ్ముతున్న యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి.సుభాశ్ కథనం ప్రకారం.. చెప్పల్‌బజార్ ప్రాంతానికి రాజేశ్‌జైన్ కుమారుడు జతిన్‌జైన్(21)సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిషేధిత చైనా మాంజాను జతిన్‌జైన్ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నాడు. విశ్వసనీయమైన సమాచారం మేరకు ఇంటిపై కాచిగూడ పోలీసులు దాడి చేసి జతిన్‌జైన్ నుంచి 10 బిండళ్ల చైనా మాంజాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు

- జయంతి వేడుకల్లో పలువురు వక్తలు

వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద నుంచి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, పార్టీ నాయకులు

సికింద్రాబాద్/మారేడ్‌పల్లి/బన్సీలాల్‌పేట, జనవరి 12 : స్వామి వివేకానందుడి జయంతిని నియోజకవర్గం వ్యాప్తంగా జరుపుకున్నారు. శుక్రవారం బీజేవైఎం సికింద్రాబాద్ నాయకుడు భాస్కరగిరి ఆధ్వర్యంలో వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద నుంచి లాలాపేటలోని వివేకానంద విగ్రహం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు మేకల సారంగపాణి, రవి ప్రసాద్‌గౌడ్, కృష్ణమూర్తి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

జేబీఎస్ చౌరస్తాలో..

నేటి యువత స్వామి వివేకానంద బాటలో నడవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జేబీఎస్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందన్నారు.

జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో..

జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గాంధీ దవాఖానలోని ఆయన విగ్రహానికి గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ అధ్యక్షులు నర్సింహమూర్తి, కార్యదర్శి నందకుమార్, దవాఖాన ప్రొఫెసర్లు డాక్టర్ శోభన్ బాబు, డాక్టర్ నర్సింహారావు , డాక్టర్ షర్మిల, డాక్టర్ జానకి, డాక్టర్ రవిశేఖర్, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ దవాఖానలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, వైద్యులు

సికింద్రాబాద్ గణపతి ఆలయ హుండీ లెక్కింపు

మారేడ్‌పల్లి, జనవరి 12: సికింద్రాబాద్ గణపతి ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె. కృష్ణ, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌గౌడ్, ఆలయ ఈఓ వినోద్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఓదెల సత్యనారాయణ పర్యవేక్షణలో 3 నెలల హుండీని పాలక మండలి సభ్యులు, సిబ్బంది, భక్తులు లెక్కించారు. సుమారు రూ. 30, 40,232 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ సత్యనారాయణ వెల్లడించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు జైరాజ్, హన్మంత్ యాదవ్, శ్రీశైలం, అశోక్‌కుమార్, రాంమోహన్, వజీర్, మోహన్, వినోద్, పద్మజ పాల్గొన్నారు.

ఉస్మానియాలో రోగులకు క్యారియర్ వాహనం

ఉస్మానియా దవాఖానకు వచ్చే పేద రోగుల కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తెలిపారు. వీల్‌చైర్లు,స్ట్రెచర్లు అందుబాటులో లేని సమయంలో రోగులు ఇబ్బందులు పడ వద్దనే ఉద్దేశంతో క్యారియర్ వాహనాన్ని ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, జనవరి 12

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలను తీసుకెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు

సికింద్రాబాద్, జనవరి 12: చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.చిలకలగూడ చౌరస్తా నుంచి వారాసిగూడ చౌరస్తా వరకు డ్రైవ్‌ను కొనసాగించారు.చిలకలగూడ, మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి చౌరస్తా, నామాలగుండు చౌరస్తా నుంచి వారాసిగూడ శివాజీ విగ్రహం, వారాసిగూడ చౌరస్తా వరకు ఈ డ్రైవ్‌ను చేపట్టారు. దుకాణాలు, వ్యాపార సముదాయాల ఎదుట పార్క్ చేసిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రోడ్లు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వారికి జరిమానాలు విధించారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసినా రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

- ప్రయాణికుల అవస్థలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణ ప్రజలు గ్రామాల బాట పట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం జూబ్లీ బస్ స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. సరిపడా బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.